# 'నిజానికి తోడు ఎవ్వరు?'

-కేశిరాజు ఫణిప్రసాద్

సాయంత్రం అయిదు గంటలు. ఎదురు చూస్తూనే ఉన్నాను. మధ్యాహ్నం రెండు గంటలకు రైల్వే స్టేషన్ కొచ్చాను. హైదరాబాద్ నుంచి కశ్యప వస్తున్నాడు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం రైలు మూడు గంటలకు సరిగ్గా టైముకే వచ్చింది. మా కశ్యప రాలేదు. "ఒరేయ్ శ్రీరామ్ నేను విశాఖపట్నం మొదటిసారి వస్తున్నాను. నువ్వు రైల్వే స్టేషన్‌కి తప్పకుండా రా" రెండు రోజుల క్రితం ఫోన్‌లో చెప్పాడు. కశ్యప రమ్మన్నాడంటే నాకెంతో సంతోషంగా ఉంది.

మరో రైలు ఆరు గంటలకి వస్తుంది. అనుకున్నట్టుగా ఉదయం కశ్యప బయలుదేరి ఉండక పోవచ్చు. ఈసారి వచ్చే రైలులో కశ్యప తప్పకుండా రావాలి. వస్తాడు.

నాలో ఎంతో నమ్మకం. అందుకే ఓపికగా ఎదురు చూస్తున్నాను.

కశ్యప, నేను ఒకే ఊరి వాళ్లం. ఒకే మాస్టారి దగ్గర ప్రయివేటు చెప్పించుకున్నాం. మాస్టారి సలహా ఇచ్చినట్టుగానే మనం, మన సంస్కృతి, మంచితనం... ఇవన్నీ పుస్తకాల్లో చదివి తెలుసుకున్నాయే. అంతేకాదు మనిషికి న్యాయం ఎంతో అవసరం. అన్యాయం చిన్నదైనా, పెద్దదయినా మనిషి జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తుంది. అందువల్ల మనుషుల్లో ఎటువంటి స్వభావాలైనా తలెత్తవచ్చు. అందుకే మనం వీలున్నంత వరకు తోటివారికి మంచి చెయ్యాలి, చెడు జరిగితే చూస్తూ ఊరుకోకూడదు. ఇటువంటి ఆలోచనలతో కశ్యప ప్రవర్తిస్తూ ఉంటాడు. ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడుతూ ఉంటాడు. ఇటువంటి స్వభావం వల్ల కశ్యప ఎన్నోసార్లు అపహాస్యాలు కూడా ఎదుర్కొన్నాడు. కాని మనిషి ఎంతో మంచివాడు. సున్నితమైన మనసున్నవాడు. కశ్యపకి నేనంటే ఎంతో ఇష్టం. నన్ను ఎంతగానో అభిమానిస్తుంటాడు.

అభిమానం ఉన్నచోట బాధ్యత ఉంటుంది. కశ్యప విషయంలో నీకెంతో బాధ్యత ఉంది. ఇటువంటి లక్షణాలు మా ఇద్దరి స్నేహాన్ని శాశ్వతం చేశాయి.

ఆలోచనలతో కాలం గడుస్తోంది. హైదరాబాద్ నుంచి వచ్చే రైలు మరికొద్దిసేపట్లో ప్లాట్‌ఫారం మీదకు వస్తుందని స్పీకర్‌లో వినిపించింది. వెంటనే కూర్చున్న వాడిని లేచి నిలబడ్డాను. రైలు ప్లాట్‌ఫారం మీద ఆగింది. మొదటినుంచి ఒక్కొక్క కంపార్ట్‌మెంట్‌లో చూసుకుంటూ నడుస్తున్నాను. అలా ప్లాట్‌ఫారం చివరకు వచ్చేశాను. ప్రయాణికులంతా దిగిపోయారు. కానీ కశ్యప రాలేదు. ఎందుకు? తప్పకుండా వస్తానన్నాడే. మనసులో ఎన్నో ప్రశ్నలు. అంతవరకు ఉన్న ఓపిక కాస్తా క్షణంలో నీరసంగా మారిపోయింది. రైల్వే స్టేషన్ నుంచి బయటకు వచ్చి మెల్లిగా నడుస్తున్నాను. అలా నెమ్మదిగా ఇంటిని సమీపించాను. అప్పటికే చీకటి పడడంతో యథాలాపంగా లైటు స్విచ్ ఆన్‌చేశాను. ఒక్కసారిగా ఉలికిపాటు. వసారాలో అరుగు చివరగా కశ్యప కూర్చుని ఉన్నాడు. ఆశ్చర్యంతో చూస్తూ నిలబడిపోయాను.

కశ్యప ఊరికి కొత్త. మరి ఇంత త్వరగా ఇంటికి ఎలా చేరుకోగలిగాడు. నాలో అయోమయం.

"ఒరేయ్ కశ్యపా, ఎంతసేపు అవుతుంది వచ్చి. ఎలా రాగలిగావ్?" ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ మాటలను కూడగట్టుకుని మరీ అడిగాను.

కశ్యప నన్ను చూస్తున్నాడు. జవాబు చెప్పలేదు.

"అలా మాట్లాడకుండా కూర్చుంటావేరా?" నాలో రేగుతున్న కోపాన్ని ఎంతో కష్టంమీద నిగ్రహించుకుంటూ అడిగాను. ఆప్తమిత్రుడు వస్తున్నాడని సెలవు పెట్టి మరీ దాదాపు నాలుగు గంటలసేపు నిరీక్షించాను. తీరా వాడు రాలేదని మనసులో ఎంతో బాధపడ్డాను. ఇవన్నీ మనసులో మెదులుతూ కోపాన్ని కలిగించాయి. అంతేకాదు, ఊరు తెలియని మనిషి సరాసరి ఇంటికి ఎలా చేరుకోగలిగాడు. సందేహంతో తికమక పడుతున్నాను.

"జరిగిందేదో తరువాత తెలుసుకోవచ్చు. ముందు స్నేహితుడిని ఇంట్లోకి ఆహ్వానించు" సభ్యత హెచ్చరించింది. తలుపు తాళం తీసి "లోపలికి రా" అంటూ వాడి బేగ్‌ని చేతుల్లోకి తీసుకుని ఇంట్లోకి అడుగుపెట్టా. లోపలికి రాగానే ఎదురుగా ఉన్న కుర్చీలో కూలబడిపోయాడు కశ్యప.

"ఏరా, ఒంట్లో బాగోలేదా" అనునయంగా అడిగా. వాడి సమాధానం కోసం ఎదురు చూడకుండా ఇంట్లోకెళ్ళి మంచినీళ్ళు తెచ్చి వాడికిచ్చాను.

ఈ పరిస్థితిలో కశ్యపని మాట్లాడించి ప్రయోజనం లేదు.

ఇద్దరం స్నానం చేసి హోటల్‌కి వెళ్ళి భోజనం చేసి ఇంటికొచ్చాం. ఇంటి ముందు పక్కలేసుకుని పడుకునే ఏర్పాటు చేశాను. విచిత్రమేమిటంటే వచ్చినప్పుడు ఎలా వున్నాడో ఇప్పటికీ అలాగే వున్నాడు. ఏదో జరిగింది. వీడెప్పుడూ ఊహించని సంఘటన అయి ఉంటుంది. వీడు మనసులో ఎందుకో బాధపడుతున్నాడు. అది అర్థం చేసుకోగలిగాను. అలాగని విషయం ఏమిటని పదే పదే అడగడం నా తెలివి తక్కువతనం. ఈ ఆలోచనతో పక్కమీద పడుకుని అలవాటు ప్రకారం ట్రాన్సిస్టర్‌లో పాటలు వింటున్నాను.

"శ్రీరామ్.. నేను..." అన్న కశ్యప మాటలు వినపడి రేడియో సౌండ్ తగ్గించి "ఏమిటిరా? ఏం కావాలి?" అని అడిగాను.

"నేను ఇవ్వాళ ఉదయం రైలులో బయలుదేరి మూడు గంటలకే ఈ ఊరు చేరుకున్నాను" కశ్యప మాటల వినగానే పడుకున్న వాడిని లేచి కూర్చున్నాను.

''నువ్వు రైల్లోనే వచ్చావా'' ఆశ్చర్యం రెట్టింపవుతుంటే అడిగాను.

"అవునురా, రైల్లోనే వచ్చాను" అన్నట్టుగా తలూపాడు.

"నన్ను తప్పకుండా రైల్వే స్టేషన్‌కి రమ్మని వాడు స్టేషన్‌లో ఎందుకు కనపడలేదు" సూటిగా అడిగాను.

"రైలు ఔటర్ సిగ్నల్ దగ్గర ఆగింది. నేను అక్కడే దిగిపోయాను" అంటున్న వాడి మాటలు నన్ను తికమక పెడుతున్నాయి. "ఔటర్ సిగ్నల్ దగ్గర నేను నాకు తెలియకుండానే దిగిపోయాను" మళ్ళీ చెప్పాడు కశ్యప.

''ఏమైందిరా నీకు, స్టేషన్‌లో నేను ఎదురు చూస్తుంటానన్న విషయం మర్చిపోయావా?"

"అసలు నన్ను నేను మర్చిపోయానురా" అంటున్న వాడినే చూస్తున్నాను.

అనూహ్యమైన సంఘటనలు జరుగుతుంటాయి. అయితే అవి మనుషుల మీద చూపించే ప్రభావం వారి వారి మనోభావాలను వెలికి తీస్తుంది. సున్నితమైన మనసున్న కశ్యపకి కూడా ఇదే జరిగుండాలి.

"ఒరేయ్ జరిగిందేదో జరిగింది. అది మర్చిపోయి నువ్వు వచ్చిన పని గురించి పట్టించుకో" నాకు తోచిన

## లకుమ నానీలు

**చూ**పులు
పేనుకుంటున్నాయి!
క్షణాల్లో / వలపు పాశం!?

ఈ 'రోజా' పువ్వుకు
అన్నీ ఎక్కువే!
రంగూ రుచీ వాసనా / చివరికి ముళ్ళూ!?

తెల్లటి ఛాయ
దారంతా జలమయం-
ఒక్కటే పరికిణీ / నాకా రెండే కళ్ళు!

ఆమె నవ్వితే
సొట్టలు!
సొట్టలుపడ్డ గిన్నెలపైనా / మనసు పోతోంది!?

ఆమె శిలువలా
ప్రపంచ సౌందర్యాన్ని మోస్తూ...!
నెత్తిన / ఓ ముళ్ళ కిరీటమా!?

స్నానాల గది
ఆమె వంటిమీద ముత్యాలు!
తువ్వాలుతో / తగవు పడుతూ!?

ఆమె-
మగ్గం నేస్తోంది!
ఇంక చీర సారెల్ని- / ఎవ్వరూ పెట్టనక్ఖర్లేదు!?

పందిట్లో
పెళ్ళవుతోంది!
పాట, అంతకంతకూ / బరువెక్కి పోతున్నది!?

సీతకు
మిమిక్రీ తెలియదు!
'హా సీతా! / హా లక్ష్మణా!?

ఆ 'కొమ్మ'లకు చిక్కుకున్నది
గాలిపటమేనా?
పదే పదే వెళ్ళి / నేనూ!?

అమ్మాయిల్తో
ఆర్నెల్ల సావాసం!
మెలికలు తిరుగుతూ / మా కాలేజీ రోడ్డూ!?

చెట్టు మీద
చిలకలు!
చెట్టు నిండా
చిలక పూలే!?

-లకుమ

మాట చెప్పాను.

నా మాటలు కశ్యపకి నచ్చలేదు. వాడినే గమనిస్తూ అనుకున్నాను.

"సారీరా శ్రీరామ్. ఇవ్వాళ నాకెదురయిన అనుభవాలు, మంచితనం, మానవత్వం మన చుట్టూ ఉన్న మనుషులకు అవసరం లేదన్న నిజాన్ని తెలుసుకునేటట్టుగా ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే ముఖ్యంగా నేను అర్థం చేసుకుంటూ ప్రదర్శించాలి."

కశ్యప మాట్లాడుతున్న తీరు విషయమేమిటో తెలుసుకోవాలన్న కుతూహలం నాలో కలిగిస్తోంది.

"ఇంతకీ జరిగిన విషయం ఏమిటో చెప్పు" అడిగాను. ఒక్కొక్కసారి తమకి జరిగింది ఇతరులకు చెప్పుకుంటే తప్ప ఊరట కలగదు.

కశ్యప మాట్లాడలేదు. కొంతసేపు ఆలోచనల్లో పడ్డాడు. ఇంతకూ ఏమైందంటే... అనగానే వింటున్నట్టు తలూపాను.

"ట్రెయిన్‌లో కూర్చుని పేపరు చూస్తున్నాను. నాకెదురుగుండా సీట్లోకి ఒకాయన కుటుంబంతో, బోల్డంత సామానుతో ఎక్కాడు. తన బెర్తు దగ్గర సామాను దింపిన కూలీకి డబ్బులిచ్చాడు. ఇచ్చిన డబ్బు సరిపోదని రైలు లోపలికొచ్చి పెట్టినందుకు డబ్బులు ఎక్కువ కావాలన్నాడు రైల్వే పోర్టర్. "ఇటువంటి పేచీలు నాకు నచ్చవు. రైల్వే కూలి ఉన్నది సామాన్లు రైల్లో పెట్టడానికే" అంటూన్నాయనతో "అదేం కుదరదు. నేను అడిగిన డబ్బులిస్తారా, సామాను కిందికి దింపెయ్యనా?" అంటూ ఆయన మీద తిరగబడ్డాడు. "సామాను మీద చెయ్యి వేసి చూడు ఏం జరుగుతుందో?" ఇవతలాయన తగువుకి సిద్ధపడ్డాడు. ఈలోగా రైల్వే కూలి వీళ్ళ తాలూకు సూట్‌కేస్ పట్టుకున్నాడు. అంతే కోపం పట్టలేక రైల్వే కూలి చొక్కా పట్టుకున్నాడు.

రైలు ప్రయాణంలో ఇలాంటివన్నీ జరుగుతూనే ఉంటాయి. మనం సర్దుకుపోతూ ఉండాలి. కశ్యప మాటలు వింటూ అనుకున్నాను.

"చూస్తూ కూర్చున్నారే తప్ప తోటి ప్రయాణీకులలో ఒక్కరు కూడా ఈ రభస పట్టించుకోలేదు" ఆ మాటలంటున్నప్పుడు కశ్యపలో సానుభూతి వ్యక్తమవుతోంది.

"నేను కలగచేసుకోవాలనుకుంటున్న టైములో మరో ఇద్దరు రైల్వే కూలీలు వచ్చి మావాడి మీద చెయ్యి వేస్తావా" అంటూ ఆయన మీదికొచ్చారు. ఈయన "పోలీసు కంప్లయింట్ ఇస్తాను. ఇచ్చిన డబ్బు తీసుకుని మర్యాదగా రైలు దిగు" అంటున్న ఆయనని కూలీలు నోటికొచ్చినట్టుగా మాట్లాడుతున్నారు.

"రైలు కదిలే టైమయింది. అంతే, ఇక తప్పనిసరి పరిస్థితులల్లో నేను జోక్యం చేసుకుని, మీ లైసెన్స్ నెంబర్లు ఇవ్వండి. ఏం జరుగుతుందో చూపిస్తానని

## గుంటూరు నానీలు

**అ**బ్బ
ఎంత ఘాటుగా వుందో
భలేవాడివే
గుంటూరు మిర్చి కదా!

గళంలోనే
సహజ మురళి
ఇప్పటికే
రఘురాముని ఈల రవళి...

వడ్లమూడిలో
పాల నురగలు
రైతు కళ్ళల్లో
సంతోషపు మెరుపులు...

త్రిపురనేని బాట
కర్ణకు మాట
కవులలో మేటి
కొండవీటి...

"గంగోత్రి" ప్రవాహం
"రసఝరి"లా
కళామతల్లికి
నమస్కారం.

విజ్ఞాన
మందిరమయింది
పద్యం పరువులెత్తి
నమో వెంకటేశా అంది...

మనసంతా
సరోవరమైన ఎన్.టి.ఆర్.
తుళ్ళింతలు
కేరింతలు...

ఆకాశంలో
కొల్లూరు
పేర్చిన ఇటుకలలో
పేరు కన్పిస్తుంది చూడు...

-కె.జె. రమేశ్

కూలీలను గట్టిగానిలదీశాను. ఏమనుకున్నారో ఏమిటో మరో మాట లేకుండా రైలు దిగి వెళ్ళిపోయారు. రైలు కదిలింది. ఆయన నాతో మాట కలిపాడు."

"మంచిపనే చేశావుగా" మెచ్చుకున్నాను. నా మాటలు వాడిని మరింత కదిలించాయి.

రైలు ప్రయాణం ప్రతి ఒక్కరికీ విచిత్రమైన అనుభవం! రైలు ఎక్కేటప్పుడు సాధారణంగా ఒకరితో మరొకరికి ముఖపరిచయం కూడా ఉండదు. అయినా సామాన్లు కాళ్ళకి అడ్డంగా ఉన్నాయనో, సీట్లు, బెర్తులు దగ్గరో తగాదాలు వస్తుంటాయి. ఇవన్నీ రైలు కదిలే వరకే. తరువాత పలకరింపులు, పరిచయాలు.

గమ్మత్తు ఏమిటంటే, ఇవన్నీ క్షణికమైనవేనని అందరికీ తెలుసు.

కశ్యప మాట్లాడుతూంటే నా మనసులో మెదిలిన ఊహలు. నాలో నేనే నవ్వుకుని వాడితో కూడా ఇదే మాటన్నాను.

"నిజం చెప్పావురా. నేనూ ఇలాగే అనుకుంటూ ఆశ్చర్యపడుతుంటాను. కాని ఒక్కొక్కసారి.." ఏదో విషయం చెప్పబోతూ మధ్యలో ఆగిపోయాడు.

"ఒక్కొక్కసారి..." అని ఆసక్తిగా వాడివైపు చూశాను.

రైలు కదిలింది. ఎవరికి వారు సర్దుకు కూర్చున్నారు. నేను అటూ ఇటూ చూస్తూ కాలక్షేపం చేస్తున్నాను. "సార్ మీరెవరో నాకు తెలియదు. నేనెవరో మీకూ తెలియదు. అయినా కూలీవాళ్ళ విషయంలో మీరు కలగచేసుకుని నాకు సహాయం చేశారు" అంటూ ఆయన నావైపు కృతజ్ఞతతో చూశాడు. "అవునండి కూలీలతో మావారు తగువుపడుతూ వుంటే వాళ్ళు మావారిని కొడతారేమోనని భయపడ్డాను" అన్న ఆవిడను 'మా శ్రీమతి, మాకు ఇద్దరు పిల్లలు' అంటూ వాళ్ళ కుటుంబాన్ని నాకు పరిచయం చేశాడు.

"చూడండి సార్, ఎప్పుడైనా ఎక్కడయినా మనం ఒకరికొకరం సాయం చేసుకుని కలిసుండాలి. ఇందాక మీరే చూశారుగా, రైల్వే కూలీలు వాళ్ళవాడు డబ్బులడగటం తప్పని తెలుసు. అయినా మిగతా కూలీలు కూడా వాళ్ళ మనిషేనని అతనికి తోడయ్యారు. మిగతా ప్రయాణీకులు చూస్తూ ఊరుకున్నారేగాని మనతో కలవలేదు. ఇదీ మన దురదృష్టం" నా అభిప్రాయం మొహమాటం లేకుండా స్పష్టం చేశాను. నేను ఈ మాటలంటున్నప్పుడు నా పక్కనే కూర్చున్నాయన కలగచేసుకుంటూ "ఒకవిధంగా మీరన్నది నిజమే కావచ్చు. కాని ఇక్కడ మరో సంగతి కూడా ఆలోచించాలి" అంటూ మమ్మల్ని చూశాడు.

అంతే! ఆయన మాటలు నాకు అర్థం కాలేదు సరికదా ఎంతమాత్రం నచ్చలేదు. "ఏమిటో మీరన్న సంగతి" మాట రెట్టించాను. "ఏం లేదండి, మనం కూడా వాళ్ళలాగే దెబ్బలాడితే ఆ కూలీలకు మనకి ఏమాత్రం తేడా ఉండదు. పైగా మన హోదాకి ఎంతో చిన్నతనం కూడాను" అన్నాడా పెద్దమనిషి.

నాకు ఒళ్ళు మండిపోయింది. "హలో గురువు గారు, నా మాట కూడా మీరు వినండి. ఇలాంటి ఆలోచనల వల్లే అవకాశం చూసుకుని మనల్ని చాలామంది దాచేస్తున్నారు. ఈ అభిప్రాయం మనలో ఉండటం వల్లే ఎక్కడ చూసినా దగా, మోసం పెచ్చు పెరిగిపోతున్నాయి" కోపాన్ని అణుచుకుంటూ మరీ ఘాటుగా సమాధానం చెప్పాను.

"కరెక్టే సార్. కాని మోసం లేనిదెక్కడ? వీళ్ళు కూలివాళ్ళు కాబట్టి మనల్ని దోచుకుంటున్నారని

## గోరింటాకు

ఆకుల్లో పచ్చదనం
ప్రకృతిలో పసిడిదనం
గోరింటాకు పండుదనం
చేతులకే నిండుదనం
పేరంటాలకే గోరింటా
పండుగ శోభ ప్రతి ఇంటా
పండిన చేయి ఎరుపంటా
ఎండిన చేయి తెలుపంటా
వేడుకల్లో గోరింటా
లేదంటే వెలితంటా
చేయి నిండా గోరింటా
చేటంతా ముఖమంటా
దివ్య ఔషధం గోరింటా
చేయి చల్లన గోరింటా
తలకు అంటితే గోరింటా
తెల్లని జుట్టుకు రంగంట
రాజస్థాన్ రంగోళీ
హిందూస్థానీ మెహందీ
అందరికి పసందంట
భారతదేశపు గోరింట!

-ధనలక్ష్మి సుధాకర్

## సర్వేజనాః సుఖినో భవంతు

వస్తూందంటే
తెలుగు సంవత్సరాది
కుహూకుహూ కోయిల రాగాలతో
హరిణారుణ శోభన కాంతులతో
నూతనోత్సాహం నరనరాల్లో నిండి
కుతూహలంతో ఎదురు చూస్తుంటాం
ఆహ్వానించే వత్సరం ఎలాంటి
ధ్వంస, విధ్వంసాలను యదలో నింపుతుందో
ఎలాంటి ప్రలపన, ప్రహ్లాదాలను ప్రసాదిస్తుందోనని
ఓరిమితో కళ్ళలో వత్తులేసుకొని ఎదురుచూస్తూ
శిశిరానికి తాత్కాలికంగా వీడ్కోలు చెబుతూ
గ్రీష్మానికి తాదాత్మ్యముతో స్వాగతం పల్కుతూ
మండే అరుణుడి మాటల్లో, అంతకన్నా
మండే నిత్యావసర సరుకుల ధరల్తో
సామాన్యుడు దరిద్రుడుగా బ్రతుకలేక
వ్యయనామ సంవత్సర వ్యయం తీర్చలేక
సర్వజిత్తు చేసిన జిత్తులకు తాళలేక
నిస్పృహతో నీరసించిన బ్రతుకుకు
సర్వధారియైనా
కోలుకోలేని కష్టాలకు దారి చూపుతుందేమో?
అనే విషయం, ప్రశ్నార్థకమైంది
ఏమైనా సర్వధారి సర్వులకు ఆధారియై
సమంజసమైన మార్గం చూపుతూ
షోడశ వైభవ భోగాలను ప్రసాదించాలని ఆశతో
"సర్వేజనాః సుఖినో భవంతు"

–డి.శైలేంద్ర

అనగలిగారు. మీరో ఆలోచించండి ఈ దోపిడి ఎక్కడ మొదలైంది?

''మాటకి మాట, వాదానికి ప్రతివాదం మొదలయ్యాయి."

కశ్యప మాటలని మధ్యలో ఆపి మరీ అడిగాను. "తగాదాల ప్రయాణం" మనసులో నిట్టూర్చాను.

మా మధ్య జరుగుతున్న మాటల్లో ఎన్ని విషయాల ప్రస్తావన. ఇక్కడ ఒక విషయం తప్పనిసరిగా చెప్పాలి. ఏదైనా సంఘటన చెపుతున్నపుడు అదేదో మన కళ్ళ ముందరే జరుగుతున్నట్టుగా చెప్పగలడు. ఇది కశ్యప ప్రత్యేక లక్షణం. "ఎందుకో అనుకోకుండా చుట్టుపక్కల చూశాను. అంతవరకు అక్కడా ఇక్కడా కూర్చున్న ప్రయాణీకులు మరి కొంతమంది కూడా నేను కూర్చున్న చోటుకి వచ్చి సర్దుకుని కూర్చున్నారు."

"గురువుగారూ, నాకు తోచిన మాట చెపుతున్నాను. ప్రతిరోజూ పొద్దుటి నుంచి సాయంకాలం వరకు అన్నివిధాల నష్టపోతున్నాం'' అప్పుడే అక్కడికొచ్చిన పెద్దమనిషి మాట్లాడాడు.

"అవును సార్, మనం ఎంతో పోగొట్టుకుంటున్నాం. అది ఎవరో మనకిచ్చినది, అనాయాసంగా మనకొచ్చినది కాదు. రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించుకున్న ఎంతో విలువైన డబ్బు! ఈ నిజం తెలిసి కూడా మనం ఊరుకుండిపోతున్నాం. మరి ఎందుకని?" అందర్నీ చూస్తూ అడిగాను.

నా మాటకు బదులివ్వలేదు. కాని అందరూ నన్నే చూస్తున్నారు.

"హత్యలు, హింస, దొంగతనాలు, పిల్లల్ని ఎత్తుకుపోవడం... చెప్పుకుంటుంటే ఎన్నో ఉన్నాయి. ఇవి పేపర్లో చదువుతున్నవే, టీవీలో చూస్తున్నవే.

"అవును సార్, మీరు సరిగ్గా చెప్పారు. అక్రమాలు, అన్యాయాలు... వీటన్నంటి మధ్య మనం బ్రతుకుతున్నాం. నా మాటకు వత్తాసుగా నా ప్రక్కనే కూర్చున్న ఒకాయన మాట్లాడాడు.

"ఇవన్నీ మనం తెలిసి తెలిసీ చూస్తూ ఊరుకోవలసిందేనా? అందరినీ చూస్తూ నేను ప్రశ్నించాను.

"నిజమేనండీ, ఎంతమందితో పోట్లాడతాం. ఎన్నిసార్లని మనం ఎదుర్కొని నిలబడతాం?'' మరొకాయన మాట్లాడిన తీరు.

"చూశారా మాస్టారు మన పరిస్థితి మన జీవితం ఎంత దిగజారిపోయిందో చూస్తూ కూడా నిస్సహాయంగా బ్రతుకుతున్నాం" అంటున్నారు ఆయన. రైల్వే కూలీలలో తగువు పడిన ఆయనతో అన్నాను.

"అవునండీ, మనం ఎన్నో చెయ్యాలని, ఏదో సాధించాలని ఆశిస్తాం. ఆని మనం అనుకున్నవన్నీ చెయ్యగలమా చెప్పండి!" అన్న ఆయన మాట్లాడడం నాకు ఎంతమాత్రం నచ్చలేదు. ఈ విషయమే నేను ఆయనతో చెప్పేశాను.

కశ్యప ఆలోచనా విధానం మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. అభినందిస్తూ మాట్లాడాను.

"ఈలోగా కాఫీ, టీ.. అంటూ రైల్వే కేటరింగ్ వాళ్ళొచ్చారు. ఎవరెవరికి ఏం కావాలో అడిగి మరీ అమ్ముతున్నారు. ముందు ఇద్దరు తీసుకున్నారు.

"ఎలా ఉంది రుచి'' కావాలనే అడిగాను.

"తప్పనిసరై తాగుతున్నాం కాని రైల్లో దొరికే కాఫీ, టీలకు గొప్ప రుచి ఏముంటుందండి?" అని ఒకరు, "ఇది టీ అని చెప్పటానికి మనసొప్పడంలేదండి. వేడినీళ్ళు" అని మరొక వ్యక్తి అన్నారు. ఆ మాటలు విన్నాక మిగతావాళ్ళు "అటువంటప్పుడు తాగడం ఎందుకు, రైల్వే స్టేషన్‌లో తాగుతాం" అంటూ ముందు అడిగిన వాళ్ళు వద్దని చెప్పేశారు.

అంతే! కాఫీ, టీ అమ్మేవాళ్ళు నావైపు ఒళ్ళు మండిపోతున్నట్టుగా చూశారు. నాకు మాత్రం ఎంతో ఆనందంగా ఉంది. నా అభిప్రాయాలకు గుర్తింపు లభించినందుకు. ఇంకా ఎన్నో సంగతులున్నాయి. వాటన్నింటిని వాళ్ళతో చర్చిస్తూనే ఉన్నాను.

ఒక్కసారి అందరినీ పరిశీలనగా చూశాను. అర్థం చేసుకున్నాను. వాళ్ళలో ప్రతీ ఒక్కరూ నేను మాట్లాడిన మాటల్లో ఉన్న నిజాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నారు. ఆ నిజం గురించే ఆలోచిస్తున్నారని నేను అర్థం చేసుకున్నాను.

"చూడండి, మనందరం ఇలా ప్రయాణంలో కలుసుకున్నాం. ఒకరినొకరు పలకరించుకున్నాం. పరిచయాలు చేసుకున్నాం. ఎన్నెన్నో విషయాలు మాట్లాడుకున్నాం. అభిప్రాయాలు ఒకరికొకరం చెప్పుకున్నాం"

"గురువుగారూ, నాకు మాత్రం ఎంతో సంతోషంగా ఉందండి. మీరు ఇలా అన్ని విషయాల గురించి మాట్లాడుతూంటే మంచి కాలక్షేపంగా ఉందండి" అని వాళ్ళలో ఒకతను అన్నాడు.

"అతను నిజంగా అంటున్నాడా, నన్ను వెటకారం చేస్తున్నాడా?" అనిపించింది. మళ్ళీ ఒకసారి అతన్నే చూశాను.

అతను నన్ను చూసి నవ్వుతూనే ఉన్నాడు. అతని నవ్వుకు అర్థమేమిటి? ఆ ఆలోచన అనవసరమని పించింది.

"మన జీవితం ఎంతో విలువైనది. నీతిగా ఉంటూ, నిజాయితీగా బ్రతుకుతూ ఆ విలువలను కాపాడు కోవాలి. ఒకరికొకరం సహాయపడాలి" అని ఒక్క క్షణం ఆగాను.

"సార్, నాకొకటి అనిపిస్తోంది. మనల్ని మోసం చేసేవాళ్ళు, అన్యాయంగా బాధపెట్టేవాళ్ళు ఎంతో మంది ఉన్నారు. కాని మనకి తోడుగా నిలబడేవాళ్ళు ఎవరైనా ఉంటారా. అహ! నాకు తెలియక అడుగు తున్నాను" ఎదురుగా కూర్చున్న వాళ్ళలోంచి ఒకాయన అనుమానం.

ఆయనకి వచ్చిన అనుమానం ఎంతో సహజంగా ఉంది.

"ఎవరో వచ్చి మనకి సాయం చెయ్యాలనుకోవడం బాగానే ఉంది. ముందు మనం ఇతరులకు చేతనయిన సాయం చెయ్యాలి. చేయూతనివ్వడం మనతోనే ప్రారంభం కావాలి. ఇలా ప్రతీ ఒక్కరూ అనుకుంటే చాలు. ఇంకా చెప్పాలంటే 'చైతన్యం' ఈ రోజుల్లో అందరిలోనూ కలగాలి."

నా మాటలకి అందరూ అవునన్నట్టుగా తలూపారు.

రైలు స్టేషన్‌లో ఆగింది. అనకాపల్లి స్టేషనొచ్చింది. ట్రెయిన్‌లో నుంచి దిగి ప్లాట్‌ఫారం మీద నిలబడ్డాను. ఎప్పుడో చిన్నప్పుడు చూసిన ఊరు. మరిప్పుడు ఎంతగానో మారిపోయింది. అనకాపల్లి బెల్లం చాలా బాగుంటుందని మా నాన్నగారు చెప్పటం విన్నాను.

## ఆంతర్యాన్ని పట్టుకోవాలి

పిందెల్ని తెంపేసేవాడు
మొగ్గల్ని నలిపేసేవాడు
కసుకాయల్ని కాలరాసేవాడు
కన్నతల్లిని గాని
కట్టుకున్న దాన్ని గాని
పుట్టిన భూమిని గాని
ఏం ప్రేమిస్తాడు...
అగరొత్తుల పొగని
అసహ్యించుకునేవాడు
హరివిల్లుని
ఇష్టపడనివాడు
పూ పరిమళం
ఆస్వాదించలేనివాడు
పుట్టి ఏమి సాధిస్తాడు
ఎదిగి ఏమి పొందుతాడు
వీడి ఆంతర్యాన్ని
మనం పట్టుకోవాలి
వాడితో జతగట్టి
వాడి గుట్టు తెలుసుకోవాలి
వాడిని మన దారికి తెచ్చుకోవాలి
అప్పుడే నీకూ నాకూ మనందరికీ శాంతి

–బద్ది నాగేశ్వరరావు

అలా అనుకుంటూ అటూ ఇటూ చూస్తూంటే అవతల ప్లాట్‌ఫారం మీద బెల్లం దిమ్మలు గోనె సంచుల్లో పేర్చి కనపడ్డాయి.

మరో అయిదు నిమిషాలు గడిచాయి. రైలు కదులుతోంది.

నేనూ హడావుడిగా రైలు ఎక్కి నా సీట్లోకొచ్చి కూర్చున్నాను. అంతవరకు కంపార్ట్‌మెంట్‌లో ఎటువంటి హడావుడి లేదు. అనకాపల్లి స్టేషన్లో కొందరు చేగోడీలు, జెంతికలు అమ్ముతున్నారు. మరికొంత మంది జీళ్ళు అమ్ముతున్నారు. ఇంకొంత మంది మామిడి తాండ్ర, అరటిపళ్ళు అమ్ముతూ రైల్లో అటూ ఇటూ తిరుగుతున్నారు. ఎవరికి కావలసినవి వాళ్ళు కొనుక్కుంటున్నారు.

"బఠానీలు, బఠానీలు.. వేడివేడి బఠానీలు, కాలక్షేపం బఠానీలు" అంటూ మరో కుర్రాడు అరుస్తున్నాడు.

ట్రెయిన్‌లో ఎంతో సందడి. అలా అమ్మేవాళ్ళనే చూస్తున్నాను.

చిరుతిళ్ళు అమ్మేవాళ్ళు హడావుడిగా అటు ఇటూ తిరుగుతున్నారు. ఇక్కడా గమ్మత్తు ఏమిటంటే, అవి కొనిపెట్టమని అడుగుతున్నవాళ్ళు చిన్నపిల్లలు, కొనుక్కుని ఎక్కువగా తింటున్నది పెద్దవాళ్ళు!

మరో విషయం కూడా గమనిస్తున్నాను. వేరుశెనక్కాయలు, పంచదార చిలకలు, బఠానీలు అమ్మేవాళ్ళు ఎప్పుడూ చిన్నపిల్లలకి దగ్గర్లోనే ఉండి అమ్ముతూంటారు. ఇటువంటి కిటుకులు ఉపయోగిస్తేనే అమ్మకాలు జోరుగా ఉంటాయి మరి.

"అమ్మా బఠానీలు కొనిపెట్టవే" అని నా పక్కసీట్లో కూర్చున్నవాళ్ల కూతురు అడిగింది. ఆవిడ తన భర్తతో చెప్పగా ఒప్పుకున్నాడు. బఠానీలు అమ్మే కుర్రాడు పిలవకుండానే దగ్గరకొచ్చాడు.

"ఎంతరా అబ్బాయ్ బఠానీలు" అడిగాడు ఆ అమ్మాయి వాళ్ళ నాన్న.

"ఎంతో కాదు సార్, ఒకే ఒక్క రూపాయి. ఇదిగో సార్ ఈ డబ్బా నిండా పోసి ఇస్తాను. చెప్పండి సార్, ఎన్ని డబ్బాలు కావాలి?" మంచి బేరం పోగొట్టుకో కూడదనే ఆరాటం ఆ కుర్రాడిలో. ఈలోగా వాళ్ళావిడ ఓ రెండు బఠానీ గింజలు నోట్లో వేసుకుని "చాలా రుచిగా ఉన్నాయండి" అని చెప్పింది. అది విన్న ఆయన "ఓ మూడు డబ్బాలు ఇవ్వు" అని చెప్పాడు. వెంటనే ఆ కుర్రాడు డబ్బాతో బఠానీలో పొయ్యటం మొదలెట్టాడు.

డబ్బాలో బఠానీలు పోస్తుంటే అలాగే చూస్తున్నాను. చూపు తిప్పకుండా బఠానీలు కొలవడం గమనిస్తున్నాను. నాలో చిన్న అనుమానం. మరింత శ్రద్ధగా చూశాను. నాది ఒట్టి అనుమానం కాదు. నిజం, పచ్చి నిజం.

నేను వాళ్ళతో "మాస్టారూ, ఒక్క నిమిషం ఆగండి" బఠానీలు తీసుకోబోతూ నా మాటకు ఆగి, ఎందుకన్నట్టుగా నా వైపు చూశారు.

కూర్చున్న వాడిని లేచి బఠానీల బుట్టలోంచి వాడు కొలిచే డబ్బాని చేతిలోకి తీసుకున్నాను. అందుకు బఠానీలమ్మే కుర్రాడు "సార్ ఈ డబ్బాతో మీకేంటి పని?" అంటూ నా చేతిలోంచి డబ్బాని లాక్కు పోయాడు. ఆ అవకాశం వాడికివ్వలేదు.

నేను డబ్బాలో చెయ్యి పెట్టి అడుగున ఉన్న కాగితపు చుట్టని పైకి లాగాను. కాగితం చుట్ట కూడా డబ్బా రంగులోనే ఉంది. "వీడు డబ్బా లోపల ఎవరికీ తెలియకుండా ఇంత లావుపాటి కాగితం చుట్టి పెట్టాడు. అంటే మనకి డబ్బాకి సరిపడా బఠానీలు రావు. డబ్బాలో సగం బఠానీలే వస్తాయి. చూశారా వీడు అర్ధరూపాయి బఠానీలు ఇస్తున్నాడు. రూపాయి వసూలు చేస్తున్నాడు" అంటూ నా చేతిలోని కాగితం చుట్టని అందరికీ చూపించాను.

"ఏరా, ఇలా రోజూ ఎంతమందిని మోసం చేస్తున్నావురా" అనగానే వాడు అక్కడినుంచి పారిపోవటానికి ప్రయత్నించాడు.

కాని వాడిని మరింత గట్టిగా పట్టుకున్నాను. "చూశారా, బఠానీలు అమ్ముకునే వీడు ఇప్పుడే మోసం చేస్తున్నాడంటే, పెద్దయ్యాక మరో వ్యాపారంలో మరెన్ని మోసాలు చేస్తాడో" అంటుంటే అక్కడున్న వాళ్ళందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

వెంటనే వాడిని లాగి లెంపకాయ కొట్టాను. అంతే, అందరూ నన్నే చూస్తున్నారు.

కశ్యప మాటలు వింటున్న నేను ఉలిక్కిపడ్డాను.

"నువ్వు ఆ కుర్రాడిని కొట్టావా?" నమ్మకం కోసం మళ్ళీ అడిగాను.

"అవును, వాడు మోసం చేస్తున్నాడు. అందుకే కొట్టాను" కశ్యప మరింత ఆవేశంగా బదులిచ్చాడు.

కశ్యప ప్రవర్తన ఎంతవరకు సమంజసం? ఆలోచిస్తున్నాను.

"ఒరేయ్ శ్రీరామ్ అంతలోనే అక్కడి పరిస్థితి..."

కశ్యప కళ్ళలో ఎర్రటి జీరలు. ఏం జరిగిందోనన్న కుతూహలాన్ని రెట్టింపు చేసింది.

"నువ్వు మనిషివేనా. అసలు నీకు బుద్ధుందా" అన్న మాటకు పక్కకు చూశాను. నా పక్కనే కూర్చుని నా మాటలను మెచ్చుకున్న వ్యక్తి లేచి మరీ అడిగాడు.

అందరూ నన్నే చూస్తున్నారు. వాళ్ళ చూపుల్లో నా మీద కోపం. ఎందుకు?

"ఏవయ్యా, వాటిని కొనుక్కొంటున్నది నేను. వాటికి డబ్బులిచ్చేది నేను. ఒద్దనడానికి, కుర్రవెధవని కొట్టడానికి మధ్యలో నువ్వెవడివి? కూలీలతో తగువు పడుతుంటే నేను చూసిన సహాయానికి కృతజ్ఞతలు చెప్పిన మనిషే నన్నిలా నిలదీస్తున్నాడు. ఒళ్ళు మండిపోయి, "నేనెవరినా..." అంటున్న నన్ను "ఛీ చిన్నకుర్రాడిని కొట్టింది చాలక ఇంకా మాట్లాడుతున్నా వేమిటిరా పశువా?" మన ఆలోచనలు మంచివేనని, వాటిని ఆచరణలో పెట్టడం ఎలా అన్న మనిషి నా మీదే తిరగబడుతున్నాడు.

"ఈ కుర్రాడు మనందరిని మోసం..." నా మాటలు పూర్తికానివ్వలేదు. "చూడు ఇక్కడ మాకెవ్వరికీ కనపడని తప్పు నీ ఒక్కడికే కనిపించిందా. అసలు తప్పు చెయ్యకుండా వ్యాపారం ఎవరు చేస్తున్నారు ఈ రోజుల్లో" మీ మాటలు నాకెంతో నచ్చాయన్న వ్యక్తి ఏవగింపు.

కింద ఒలికిపోయిన బఠానీలను ఏరుకుంటున్న కుర్రాడినే అందరూ సమర్థిస్తున్నారు.

"ఒక పేద కుర్రాడి కడుపు కొట్టావు కదరా. నువ్వు మాత్రం నీతిగా ఉద్యోగం చేస్తున్నావా?" ఒకావిడ చీదరింపు. అంతే. మోసాన్ని వెతికి పట్టుకున్నందుకు నన్నే వీళ్ళందరూ ఎందుకు ద్వేషిస్తున్నారు. అంటే వీళ్ళింతవరకు మాట్లాడిన మాటలు... నాలో తికమక!

కశ్యప చెప్పడం పూర్తయింది. ఒక్క క్షణం మా మధ్య నిశ్శబ్దం.

"ఒరేయ్ శ్రీరామ్ నీ ఉద్దేశమేమిటో చెప్పరా. ఇక్కడ తప్పెవరిది?" సూటిగా అడిగాడు.

కశ్యప మాటల్లో గాని, ప్రవర్తనలో గాని ఎటువంటి తప్పూ లేదు. ఖచ్చితంగా ఇది నిజం. ఈ నిజం అక్కడున్న వాళ్ళందరికీ తెలుసు. ఎటొచ్చీ వాళ్ళలో లౌక్యం ఉంది. కశ్యపలో నిజం ఉంది. నిజంతో బ్రతకడం తెలుసు. బ్రతుకులో చైతన్యం ఉండాలని తెలుసు. అయితే...

నిజానికి ఎప్పుడూ ఎక్కడా తోడు ఉండదు. ■

# నా లోకం నాదేను

నా లోకం నాదేను నా లోకంలో నేనుంటా?
నా లోకంలో విహరిస్తా అనుభూతులు వివరిస్త
నా లోకంలో అనంత లోకాలున్నవి
నా లోకంలో ఎనలేని కీర్తిసుఖాలున్నవి
ఏ లోకంలో విహరిస్తావో?
ఏ అనుభూతికి లోనైతావో?
అనుభవించిన వానికి తెల్సు
మంచివైపే నీ మనసు నిల్పు
కామ క్రోధ లోభ మోహములు
మధ మాత్సర్యాది లోకములు
దాటితివా! నాలోకమస్తది
అనంత కీర్తి సుఖాలు ఇస్తది
మధురమునకు మించిన మకరందం
నా లోకంలో బ్రహ్మానందం
నా లోకంలో చికాకులు లేవు
శోకాలు దరిదాపుకు రావు
నా లోకంలో గర్వం సర్వం అనిగిపోతది
నా లోకంలో విశ్వప్రేమ గోచరిస్తది
నా లోకంలో సమదృష్టి కానవస్తది
నా లోకంలో సృష్టి చరిత్ర పుట్టుకొస్తది
నన్నయ తిక్కన సోమన కవులు, వేమన బద్దెన భర్తృహరి
మొల్ల తులసి కాళిదాస కబీరు వాల్మీకి పోతన శ్రీనాథుడు
నా లోకంలో విహరించిండ్లు నానావిధ కృతులు వ్రాసిండ్లు
నా లోకంలో విహరించి ఎందరో కవి కవయిత్రు లైయిండ్లు
నా లోకంలో విహరించి ఎన్నో కన్నీటి కథలు వ్రాసిండ్లు
నా లోకంలో విహరించి ఎందరో గొప్ప తాత్వీకులైయిండ్లు
నా లోకంలో విహరించి కొందరు గగన శాస్త్రజ్ఞులైయిండ్లు
నా లోకంలో కవుల కావ్యాలు నాటివి, నేటివి, చదువవలే
నా లోకంలో చదువుతూ, నిరంతరం, నీలో సాధన చెయ్యవలే
నా లోకంలో మానవాలి సుఖజీవనమునకై కావ్య రచనలకు పూనవలే
ఈ లోకంలోని కవిత గంగ యమునలై ఉప్పొంగదా?
ఈ లోకంలోని కవిత ప్రజల గుండెలలో గుడియై నిలువదా!
ఈ లోకంలో రవి భువి ఉన్నంతవరకు నీవు సుకవిగా నిల్వవా?

–నడిమెట్ల రామయ్య